ఆహ్లాదం.. కనుమరుగు



పచ్చని మొక్కలతో ట్రీవాల్ (నాడు)

ఓ వైపు పచ్చని కొండలు.. మరోవైపు సువిశాల సాగరతీరం.. వీటి మధ్య ప్రయాణమంటే ప్రతీ ఒక్కరికీ ఎంతో సరదా. అందుకే భీమిలి బీచ్‌రోడ్డులో ప్రయాణమంటే ఎంతో ఇష్టపడతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం బీచ్‌రోడ్డు సుందరీకరణలో భాగంగా ఎంతో చక్కగా తీర్చిదిద్దింది. హై మాస్ట్ లైట్లు, కల్వర్టుల వద్ద ట్రీవాల్స్, నేమ్ బోర్డులు, అందంగా ఫుట్‌పాత్‌లు, పెయింటింగ్స్, రోడ్డుకు ఇరువైపులా పచ్చని మొక్కలు ఏర్పాటు చేసి భీమిలి బీచ్ రోడ్డుకు కొత్త శోభను తీసుకుని వచ్చారు. దీంతో పర్యాటకులతో పాటు ప్రయాణికులు మరపురాని అనుభూతిని పొందారు.



ఎండిపోయి, కళ తప్పిన ట్రీవాల్ (నేడు)

ప్రభుత్వం మారిన తరువాత బీచ్ రోడ్డును అభివృద్ధి చేయడం దేవుడెరుగు.. చేసిన అభివృద్ధినీ పరిరక్షించని పరిస్థితి. ప్రస్తుతం ట్రీవాల్స్‌లో మొక్కలు ఎండిపోయి కళా విహీనంగా తయారయ్యాయి. ఫుట్‌పాత్‌లు, బెంచీలు ధ్వంసమయ్యాయి. బీచ్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పరిస్థితి అడగనవసరం లేదు. కొన్ని చోట్ల లైట్లు మాయమైపోయి, మరికొన్ని చోట్ల వెలగలేని పరిస్థితుల్లో ఉన్నాయి. రోడ్డు మధ్య డివైడర్లలో ఏర్పాటు చేసిన మొక్కల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. అడుగడుగునా ఎండిపోయిన చెట్లు దర్శనమిస్తున్నాయి.

- కళావిహీనంగా బీచ్ రోడ్డు
- ఎండిపోతున్న ట్రీవాల్స్
- ధ్వంసమైన బెంచీలు, ఫుట్‌పాత్‌లు
- పర్యాటకుల్లో అసంతృప్తి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కళావిహీనంగా తయారైంది. గత ప్రభుత్వం గుడ్లవానిపాలెం బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. గుడ్లవానిపాలెం వద్ద బీచ్ పార్క్ అభివృద్ధి, సాగర్‌నగర్ కల్వర్టు, రుషికొండ ఐటి జంక్షన్ కల్వర్టుల వద్ద ప్రాంతాలను తెలియజేసే బోర్డులతో పాటు



ధ్వంసమైన ఫుట్‌పాత్

ట్రీవాల్స్, ఇక్కడ కల్వర్టుల వద్ద దిగువ నుండి ప్రవహించే మురుగు నీరు కనిపించకుండా, దుర్వాసన రాకుండా పచ్చదనం కనువిందు చేసేలా ఆహ్లాదకర రీతిలో పలు జాతుల మొక్కలను ఈ ట్రీవాల్స్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్రీవాల్స్‌లో మొక్కలు, డివైడర్లపై మొక్కలు ఎండిపోయాయి. లైట్లు వెలగక రోడ్డులో అంధకారం నెలకొంది. ఫుట్‌పాత్‌లు ధ్వంసమయ్యాయి. దీంతో ఇటుగా వెళ్తున్న ప్రయాణికులు నాడు ఎలా ఉండేదో, నేడు ఎలా ఉందో ఊహించుకుని ప్రస్తుత ప్రభుత్వ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బీచ్ రోడ్డు సుందరీకరణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సెంట్రల్ లైటింగ్ దుస్థితి



ఎండిపోతున్న మొక్కలు

చీకటైతే భయం



చీకటైతే బీచ్‌రోడ్డులో వెళ్లాలంటే భయంగా ఉంటోంది. గతంలో లైట్లు ఉండటంతో ఏ సమయమైనా ధైర్యంగా వెళ్లేవాళ్లం. కానీ, ఇప్పుడు సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో ఆందోళనగా ఉంటోంది. అందంగా నాటిన మొక్కలు కూడా ఎండిపోయాయి. అధికారులు దృష్టి సారించాలి.

–అల్లూరి పార్వతి, సాగర్‌నగర్

ఎక్కడ చూసినా కళావిహీన దృశ్యాలు



గతంలో బీచ్‌రోడ్డులో ప్రయాణిస్తుంటే మనసుకు ఆహ్లాదకరంగా ఉండేది. నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. భీమిలి నుండి విశాఖ వరకు రోడ్డు వెంబడి కళావిహీన దృశ్యాలే కనపడుతున్నా యి. ఎండిపోయిన చెట్లు, వాడిపోయిన మొక్క లు, వెలిసిపోయిన రంగులు, పాడైన ఫుట్‌పాత్‌లు కనిపిస్తున్నాయి. – నొడగల రాంబాబు, ఎండాడ

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 441 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సౌజన్య

భీమునిపట్నం: భీమిలిలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 441 కేసులు పరిష్కారమైయ్యాయి. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టులో జడ్జి పి.నాగేశ్వరరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధులకు సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీఎల్

తగరపువలస: బీజేపీలో చేరడం ద్వారా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో శనివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడుసార్లు వరుసగా అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం నుంచి దేశం నలుమూలలా ప్రతీ ఒక్కరు కనీసం మూడు సంక్షేమ పథకాలు పొంది ఉన్నారన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు భీమిలి నియోజకవర్గంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఎంపీ నిధులు భారీగా ఖర్చు చేశానన్నారు. ఈ సందర్భంగా జీవీఎల్ చేతుల మీదుగా పలువురు పార్టీ కండువాలు ధరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, రాష్ట్ర నాయకుడు ఉప్పాడ అప్పారావు, నియోజకవర్గ ఇంచార్జ్ కంటుభుక్త రామానాయుడు, జీరు కైలాసరెడ్డి, కాద సూర్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కేథరిన్ విద్యార్థుల సాయం



విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్‌కు రూ.10వేలు అందిస్తున్న సిబ్బంది

తగరపువలస: విజయవాడ వరద బాధితులకు భీమిలి కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి సాయం అందించారు. ఇప్పటికే రెండు సార్లు ఆయన విజయవాడలో నేరుగా బాధితులను కలిసి బట్టలు, నిత్యావసర సరుకులు, తాగు నీరు అందించిన సంగతి తెలిసిందే. శనివారం కేథరిన్‌విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందం బాధితుల సహాయార్థం రూ.10వేలు అందించగా నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తమకు తోచిన సాయాన్ని అందజేశారు. ఈ మొత్తంతో పాటు తన సొంత మొత్తంతో ఆలీవర్ మరోమారు విజయవాడ బాధితులను ఆదుకోనున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రెయిలింగ్‌పై ప్రమాదానికి గురైన కారు

పీఎం పాలెం: జాతీయ రహదారిపై ఎండాడ కూడలికి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. తండ్రీ కొడుకులు ప్రయాణిస్తున్న కారులో నిద్రలోకి జారుకున్న కుమారుడు డ్రైవ్ చేస్తున్న తండ్రిపై పడటంతో కారు అదుపు తప్పి, రైలింగ్‌ను ఢీకొని దానిమీదకు ఎక్కింది. ఈ ఘటనలో తండ్రికి స్వల్ప గాయాలు కాగా, కారు పాక్షికంగా దెబ్బతింది. స్థానిక ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యార్థుల్లో ఆధ్యాత్మిక అవగాహన పెరగాలి

తగరపువలస: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో ఆధ్యాత్మిక అవగాహన పెరగడం సమాజానికి అవసరమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులో అక్షయపాత్ర ఫౌండేషన్, హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హరేకృష్ణ మూమెంట్ సేవలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణాష్టమి, రాధాష్టమి సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం హెరిటేజ్ ఫెస్ట్–2024లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్త



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

దాస మాట్లాడుతూ చిత్రలేఖనం, భగవద్గీత శ్లోక పఠనం, పౌరాణిక వేషధారణ, గాత్ర సంగీత పోటీల్లో 44 పాఠశాలల నుంచి 3 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూమెంట్ సభ్యుడు అంబరీష దాస, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. గత వారం నుంచి ప్రతీ గురు, శుక్ర, శనివారాల్లో శ్రీవారి లడ్డూ విక్రయాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడ జరుగుతున్న విక్రయాలను ఏఈవో జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు.

దర్శనానికి పోటెత్తిన భక్తులు : స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. రెండో శనివారం సెలవు రోజు కావడం, శ్రీవారికి ప్రీతికరమైన రోజుతో పాటు ఏకాదశి కలసిరావడంతో శ్రీవారిని దర్శనాలకు



లడ్డూ విక్రయాలను పర్యవేక్షిస్తున్న ఏఈవో జగన్మోహనాచార్యులు

భక్తులు బారులు తీరారు. శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, స్వామిని దర్శించుకున్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

తగరపువలస: కమ్యూనిస్ట్ యోధుడు ఏచూరి సీతారామ్ మరణం తీరని లోటు అని సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారామ్‌కు స్థానిక సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గుజ్జు రామునాయుడు భవన్‌లో శనివారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చిల్ల నరసింహులు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, మావూరి సన్యాసమ్మ



ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

తదితరులు పాల్గొన్నారు.

17న అనంతుని జయంతి


పద్మనాభం: పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి జయంతిని ఈ నెల 17న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, భక్త బృందం సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, ఆరు గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం అనంతుని జయంతి వేడుకలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగా బేడా ప్రాంగణంలో అనంతుని వ్రతాలు జరుపుతారు. ఉదయం 7.30 గంటలకు మొదటి బ్యాచ్, ఉదయం 10.30 గంటలకు రెండో బ్యాచ్



అనంతుని ఉత్సవ విగ్రహాలు

వ్రతాలు ప్రారంభిస్తారు. గతంలో దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో, గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయంలోనూ జయంతి వేడుకలు నిర్వహించేవారు. గిరిపై ఆలయం పునర్నిర్మిస్తుండంతో ఈ ఏడాది ఇక్కడ జయంతి వేడుకలు నిర్వహించడంలేదు.


నేత్రపర్వంగా గణపతి ఉత్సవాలు



వైఎస్సార్ కాలనీలో విభిన్నంగా గణనాథుడు



శివశక్తినగర్‌లో హనుమ రూపంలో..



వాంబేకాలనీలో ఆకట్టుకున్న దీపాలంకరణ

మధురవాడ/తగరపువలస/కొమ్మాది: గణపతి ఉత్సవాల్లో భాగంగా వాంబే కాలనీలో 2016 దీపాలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది.

- జేఎస్ఎన్‌యూఆర్ఎం వైఎస్సార్ కాలనీ లో వైఎస్సార్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.
- శివశక్తినగర్ ఎస్ఎస్ఎన్ బాయ్స్ ఆధ్వర్యంలో హనుమంతుడి రూపంలో రూపొందించిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. మధురవాడ జోన్ కళింగ సేవా సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మణ, జనసేన నాయకులు పూజలు చేశారు.
- రెండో వార్డు సంతపేట రెడ్డి వీధిలో చిన్నారులు శివలింగం చుట్టూ చేసిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది.
- 4వ వార్డు మంగమారిపేట యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
- పరదేశిపాలెం కొండపేట వద్ద వినాయకుడికి విశేష పూజలు చేశారు.





సంతపేటలో ఆకట్టుకున్న దీపాలంకరణ, కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు 8వ తరగతి చదువుతున్న 82 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిగిలిన పాఠశాలల నుంచి కూడా యాజమాన్యాలు తమ విద్యార్థులను ఈ శిక్షణకు పంపించాలని నిర్వాహకులు కోరారు. సంతపేటకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దత్తి ఈశ్వరరావు విద్యార్థుల స్టేషనరీకి గాను రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, భీమిలి డైట్ అధ్యాపకులు గొట్టేట రవి, సారిపల్లి త్రినాథరావు, సొసైటీ కోశాధికారి బి.అప్పారావు, ఉపాధ్యాయులు పక్కి నాగేశ్వరరావు, వైవీ రమణ, ఎల్.ఎ.శ్రీను, ఎం.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలు ప్రారంభం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో హయ్యర్ పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఆదివారం హయ్యర్‌తో పాటు లోయర్ పరీక్షలు జరగనున్నాయి. శనివారం నాటి పరీక్షలకు 22 మంది హయ్యర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్విజిలేటర్లుగా ఎస్.జయసుధ, సుధాసునీత, సూపరింటెండెంట్‌గా



భీమిలి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో హిందీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఇన్‌చార్జి హెచ్ఎం పి.శ్రీనివాస్ వ్యవహరించారు.

మారికవలసలో ఆక్రమణ తొలగింపు

మధురవాడ: పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం మారికవలస జంక్షన్‌లో ఆనందపురం వైపు వెళ్లే బస్టాప్ వెనుక ప్రభుత్వ భూమిలో ఆక్రమణను రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం తొలగించారు. ఇక్కడ వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి స్క్రాప్ దుకాణం కోసం రేకులతో షెడ్ నిర్మిస్తున్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆక్రమణను తొలగించి, రక్షణ చర్యలు చేపట్టారు. ఇప్పటికే నాలుగు షెడ్‌లు ఇక్కడ అక్రమంగా నిర్మాణం చేసి టీ, వెల్డింగ్, పాన్ షాపు తదితర దుకాణాలు నడుతుపున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. తాజాగా మరో



మారికవలసలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమణకు దిగడంతో చర్యలు చేపట్టారు. ఆక్రమణ దారులు ఆర్ఐ ప్రవీణ్, ఇతర రెవెన్యూ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సిబ్బంది వాపోయారు.

వినాయక మండపాల వద్ద అన్న సమారాధనలు



రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో అన్నదానం చేస్తున్న యాజమాన్యం



ఉడా కాలనీ ఆదిత్య ఫార్చ్యూన్ ఆధ్వర్యంలో..



వైఎస్సార్ కాలనీలో..

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద శనివారం ఉత్సవ కమిటీల ప్రతినిధులు అన్నసమారాధనలు నిర్వహించారు.రెండోవార్డు ఆదర్శనగర్‌లో విఘ్నేశ్వర గ్రూప్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

- భీమిలి మండలం తాటితూరు, మజ్జివలస పంచాయతీలలోనూ నిర్వహణ కమిటీలు భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాయి.
- రామన్నపేట సాయిరవీంద్ర స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన మండపంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.
- **మధురవాడ:** కొమ్మాది జంక్షన్ వద్ద గల వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.
- మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలోని ఆదిత్య ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో సుమారు 3వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు.



పాత పీఎం పాలెంలో..

- 5వ వార్డు శివశక్తినగర్‌లో ఎస్ఎస్ఎన్ బాయ్స్ ఆధ్వర్యంలో మధురవాడ వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మణ సహకారంతో అన్నదానం చేశారు.
- **పద్మనాభం:** మద్దిలో రచ్చబండ వద్ద నిలిపిన వినాయక విగ్రహం దగ్గర శనివారం నిర్వహించిన అన్నదానాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఈ ప్రారంభించారు. ఐదు వేల మందికి అన్నదానం చేశారు.



మద్దిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పాత పీఎం పాలెంలో..

పీఎం పాలెం: పాత పీఎం పాలెంలో గణపతి నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ముందుగా మధ్యాహ్నం సుమారు 4 వేల మందికి అన్నసంతర్పణ చేశారు. స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, బాలాజీ , సోంపాత్రుడు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వరి సంరక్షణకు సూచనలు

తగరపువలస: ఇటీవల భారీ వర్షాల తరువాత వరిలో ఆకుముడత, తెల్ల చిత్త, నాము తెగులు ఆశించే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని భీమిలి వ్యవసాయ శాఖాధికారి బి.శివకోమలి తెలిపారు. వాటి నుంచి పంటను రక్షించుకోవడానికి ఆమె పలు సూచనలు చేశారు. మండలంలో 1245 ఎకరాలలో వరి పంట విస్తీర్ణం నమోదైందని, మండలంలో ఇప్పటికే కొన్ని చోట్ల పురుగు ఆశించి ఉందని చెప్పారు. అధిక వర్షాలకు పొలంలో నిలిచిన నీటిని తొలగించి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ చల్లుకోవాలని తెలిపారు. నాటిన 20 రోజులలోపు ముందస్తు నివారణలో భాగంగా ఎకరానికి 500 మిల్లీలీటర్ల వేపనూనె పిచికారీ చేస్తే ఆకుముడత, దోమను అరికట్టవచ్చన్నారు. ఆకుముడత, తెల్లచిత్త ఆశించిన పొలాల్లో దుబ్బులో ఆకులు నిలువునా ముడుచుకుని తెల్లని చారలు కనిపిస్తే ఎకరానికి 400 గ్రాములు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలన్నారు. వరిపొలాల్లో అక్కడక్కడ పాముపొడ తెగులు గమనించామని, దాని నివారణకు హెక్సకొనజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. మిగిలిన పంట వేసే రైతులు సమీపంలోని సచివాలయంలో ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు టైర్ల అందజేత

భీమునిపట్నం: భీమిలి పోలీస్‌స్టేషన్ పెట్రోలింగ్ వాహనానికి దివీస్ లేబరేటరీ యాజమాన్యం శనివారం రూ.32,500 విలువ గల అయిదు టైర్లను అందించింది. సీఐ సుధాకర్ దివీస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్ఐ గంటా హరీష్, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, గంటా నూకరాజు పాల్గొన్నారు.



సీఐ సుధాకర్‌కు టైర్లు అందిస్తున్న దివీస్ సిబ్బంది